GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 31 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | మంగళవారం : అక్టోబర్-01-2024 | పేజీలు : 3

## చంద్రబాబు వ్యాఖ్యలను తప్పుబట్టిన సుప్రీం కోర్టు



**టీ మీడియా, సెప్టెంబర్ 30,ఢిల్లీ :**

తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంపై ఏపీ సీఎం చంద్రబాబుచేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టుతప్పుపట్టింది. రాజ్యాంగ పదవిలో ఉన్నప్పుడు బాధ్యతగా ఉండాలి కదా అంటూ నిలదీసింది . కోట్లాది మంది భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశంపై రెండో ఒపీనియన్ తీసుకోకుండా ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి వ్యాఖ్యలు చేయడం, ఈ వ్యవహారంలో మీడియాకు వెళ్లాల్సిన అవసరం లేదని అభిప్రాయ పడింది.అప్పటి టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, బీజేపీ నాయకుడు సుబ్రమణ్యం, మరో ఇద్దరు న్యాయవాదులు చంద్రబాబు తప్పుడు ఆరోపణలు చేస్తూ తిరుమల పవిత్రతకు భంగం కలిగిస్తున్నారని, కల్తీ వ్యవహారంపై నిజనిజాలు తేల్చాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌పై సోమవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్ విచారణ చేపట్టారు. ఏపీ ప్రభుత్వం తరపున సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. లడ్డూలో కల్తీ జరిగిందని అనుమానం ఉన్నప్పుడు సెకండ్ ఒపీనియన్ ఎందుకు తీసుకోలేదని ఏపీ న్యాయవాదిని ప్రశ్నించింది.నెయ్యి కల్తీ జరిగినట్టు గుర్తించిన తర్వాత , తయారైన లడ్డూలను టెస్టింగుకు పంపారా, లడ్డూలో కల్తీ జరిగిందని నిర్ధారించారా అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. కల్తీ నెయ్యితో లడ్డూలు తయారు చేసినట్లు ఆధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఇరువాదనలు విన్న కోర్టు కనీసం దేవుడినైనా రాజకీయాల నుంచి దూరం పెట్టాలని సూచించింది.

## నరమాంస భక్షనకు అలవాటు పడిన చిరుత..



11 రోజుల్లో ఏడుగురు మృతి

3లో..

## ఫ్యామిలీ డిజిటల్ కార్డులు



- 119 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో పైలెట్ ప్రాజెక్టులు
- 238 ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన

3లో..

## కన్నీరుపెట్టిన మంత్రి కొండా సురేఖ

### మహిళని చూడకుండా సోషల్ మీడియాలో ట్రోల్

**టీ మీడియా, సెప్టెంబర్ 30, హైదరాబాద్ :**



తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్‌పై తీవ్రస్థాయిలో స్పందించారు తెలంగాణ మంత్రి కొండా సురేఖ. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో బీజేపీ నేత, మెదక్ ఎంపీ రఘునందన్ రావు మంత్రి కొండా సురేఖ మెడలో నూలు దండా వేశారు. దీనిపై కొందరు సోషల్ మీడియాలో ట్రోల్ చేశారు. అయితే ఇదంతా బీఆర్ఎస్ పనే అంటూ

3లో..

# నేపాల్‌లో వర్షం... బీహార్‌లో వరదల బీభత్సం

- కోసి నది బీహార్ దుక్కంకు కారణం
- చిక్కుకున్న 13 జిల్లాలు





**టీ మీడియా,సెప్టెంబర్ 30,న్యూ ఢిల్లీ :**

నేపాల్‌లో కురుస్తున్న వర్షాల కారణంగా బీహార్‌లోని పలు జిల్లాలు ప్రమాదంలో పడ్డాయి. నేపాల్ లోని వరదలు, వర్షాల కారణంగా బీహార్ లో అనేక ప్రాంతాలలో భారీ నష్టం చోటు చేసుకుంది. సరిహద్దు జిల్లాల్లో చాలా చోట్ల నదులు ప్రమాదకర స్థాయికి మించి ప్రవహిస్తున్నాయి. 1968 నుంచి ఇప్పటి వరకూ నేపాల్‌లో ఇంత భారీ వర్షాలు ఎప్పుడూ పడలేదు. ఈ ఏడాది సెప్టెంబర్ 27 నుంచి నేపాల్‌లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. నేపాల్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కోసి బ్యారేజీ వీర్‌పూర్ నుంచి ఆదివారం రికార్డు స్థాయిలో 6,61,295 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గండక్ బ్యారేజీలో దాదాపు అంతే మొత్తంలో నీటిని విడుదల చేశారు.దీని కారణంగా బీహార్‌లో కోసి, గండక్ బాగ్మతి, బుద్ధి గండక్, కమల బాలన్, మహానంద, గంగా వంటి నదులు ఉప్పొంగు తున్నాయి. ఈ నదుల నీటిమట్టం గణనీయంగా పెరిగిం ది. ఈ నదులు ప్రమాదకర స్థాయికి మించి ప్రవహిస్తున్నాయి. కోసి బ్యారేజీ వీర్‌పూర్ నుంచి రికార్డు స్థాయి లో నీటి విడుదలతో 13 జిల్లాల్లో 16.28 లక్షల మందికి పైగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికే భారీ వర్షాల కారణంగా బీహార్ ప్రజలు వరదలతో పోరాడుతున్నారు. 1968లో కోసి బ్యారేజీ వీర్‌పూర్ నుంచి 7.88 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఆ సమయంలో కూడా బీహార్‌లోని పలు జిల్లాల్లో విధ్వంసం జరిగింది.

### చిక్కుకున్న 13 జిల్లాలు

ఈసారి కూడా దాదాపు అదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ నదుల (కోసి, గండక్,యు గంగా) నీరు పశ్చిమ,తూర్పు చంపారన్, గోపాల్‌గంజ్, అరారియా, సుపాల్, కతిహార్, పూర్నియా సహా అనేక ఇతర జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాలలోకి ప్రవేశించింది. శనివారం ఉదయం బీహార్‌లోని వివిధ ప్రాంతాల్లో 780.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బీహార్‌లోని కొన్ని జిల్లాల్లో వర్షాలు ఇంకా కొనసాగుతున్నాయి.బీహార్‌లోని పలు జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం అలర్ట్ ప్రకటించింది. మరోవైపు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, వరద ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రస్తుతం, బక్సర్, భోజ్‌పూర్, సరన్, పాట్నా, సమస్తిపూర్, బెగుసరాయ్, ముంగేర్, భాగల్‌పూర్‌తో సహా గంగా ఒడ్డున ఉన్న 13 జిల్లాల్లో వరదల పరిస్థితి ఉంది.వరదలు, వర్షాలు నేపాల్‌లో విధ్వంసం సృష్టించాయిమరోవైపు నేపాల్‌లో వరదలు, వర్షాలు, కొండచరియలు విరిగిపడటంతో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 148కి చేరింది. వరదలు, కొండచరియలు విరిగిపడటంతో 55 మంది గల్లంతయ్యారు. 101 మంది గాయపడ్డారు. చాలా ప్రాంతాల్లో జనజీవనం స్తంభించిపోయింది. అనేక రహదారులు మూసుకుపోయాయి. వందలాది ఇళ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డారు. రహదారుల దిగ్బంధనంతో వేలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోయారు. కనీసం 322 ఇళ్లు, 16 వంతెనలు దెబ్బతిన్నాయి. దాదాపు 3,626 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రజలను రక్షించేందుకు 20,000 మందికి పైగా భద్రతా సిబ్బందిని మోహరించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

### నేపాల్ సంబంధం ఏమిటి?

నేపాల్‌లో వర్షం కారణంగా, బీహార్‌లోని మైదాన ప్రాంతం నేపాల్‌కు ఆనుకుని ఉన్నందున బీహార్‌లో వరదలు సంభవించాయి. కోసి, గండక్, బుధి గండక్, కమ్లా బాలన్, బాగ్మతి వంటి అనేక నదులు నేపాల్ నుండి బీహార్ వరకు ప్రవహిస్తాయి. నేపాల్‌లో వర్షాలు కురిసినప్పుడల్లా అక్కడ నదుల నీరు బీహార్‌కు రావడం ప్రారంభమవుతుంది. నేపాల్‌లోని ఏడు నదులు కోసిలో కలుస్తాయి. ఇది ప్రతి సంవత్సరం బీహార్‌లో వినాశనం కలిగిస్తుంది. అందుకే కోసిని బీహార్ దుఃఖం దాయని అని కూడా పిలుస్తారు. బీహార్‌లోని తూర్పు చంపారన్, పశ్చిమ చంపారన్, సీతామర్హి, మధుబని, సుపాల్, అరారియా కిషన్‌గంజ్ జిల్లాలు నేపాల్‌కు ఆనుకుని ఉన్నాయి. ప్రస్తుతం ఈ జిల్లాలు కూడా వరదల్లో చిక్కుకున్నాయి. ఇక్కడ కూడా లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది.



## తెలుగు రాష్ట్రాల్లో సైబర్ క్రిమినల్స్ కోసం సిబిఐ సోదాలు

**టీ మీడియా,సెప్టెంబర్ 30,న్యూ ఢిల్లీ :**

తెలుగు రాష్ట్రాల్లో సైబర్ క్రిమినల్స్‌పై సీబీఐ భారీ ఆపరేషన్ చేపట్టింది. సైబర్ నేరస్థులను పట్టుకోవడానికి సోదాలు నిర్వహిస్తున్న సీబీఐ, హైదరాబాద్, విశాఖపట్నం సహా పూణే, అహ్మదాబాద్ వంటి నగరాల్లో దాడులు చేసింది. హైదరాబాద్‌లో ఐదుగురు, విశాఖపట్నంలో 11 మంది సైబర్ నేరస్థులను అరెస్టు చేసింది. ప్రస్తుతం 170 మంది సైబర్ నేరస్థులను గాలిస్తున్నట్లు సీబీఐ వెల్లడించింది.

విశాఖపట్నంలోని విసి ఇన్ఫ్రా మ్యాట్రిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, అత్రియా గ్లోబల్ సర్వీసెస్, హైదరాబాద్‌లోని వీఏజెక్ సొల్యూషన్స్ లాంటి సంస్థల్లో సీబీఐ సోదాలు జరుపుతుంది. ఈ సైబర్ నేరగాళ్లు అమెరికా, కెనడాలో ఉన్న ప్రజలను టార్గెట్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్నట్లు తేలింది. ఆపరేషన్ చక్ర భాగంగా ఇంటర్‌పోల్ అందించిన సమాచారం మేరకు నాలుగు ప్రధాన నగరాల్లో సీబీఐ సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో సీబీఐ పెద్ద ఎత్తున నగదు, ఎలక్ట్రానిక్ డివైసులను స్వాధీనం చేసుకోవడంతో పాటు, అనేక బ్యాంకు ఖాతాల సమాచారాన్ని కూడా జప్తు చేసింది.

## నీ అయ్య జాగీరు కాదు.. సీఎం రేవంత్‌పై కేటీఆర్ గరం గరం..



3లో..



## జపాన్ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి భట్టి

**టీ మీడియా, సెప్టెంబర్ 30,హైదరాబాద్ :**


వారం రోజుల అమెరికా పర్యటన తర్వాత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి , ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు మూడు రోజుల పర్యటనకు జపాన్ చేరుకున్నారు. సోమవారం మధ్యాహ్నం హానిడా విమానాశ్రయంలో దిగిన ఆయనకు భారత రాయబార కార్యాలయ ప్రతినిధులు అజయ్ సేథి, మధుసూదన్, అమన్ ఆకాష్ ఆయనకు స్వాగతం పలికారు. ఆయనతోపాటు రాష్ట్ర బృందం లో ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కే రామకృష్ణ రావు, ఇంధన శాఖ కార్యదర్శి డి. రోనాల్డ్ రోస్, సింగరేణి సిఎండి ఎన్ .బలరామ్ ఈ పర్యటన లో పాల్గొంటున్నారు.పర్యావరణహిత పరిశ్రమలు, అత్యాధునిక మైనింగ్ సంబంధిత టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ల ఏర్పాటు తదితర అంశాల పరిశీలనకై ఈ బృందం జపాన్ లోని పలు ప్రముఖ పరిశ్రమలను సందర్శించడంతోపాటు వివిధ దిగ్గజ కంపెనీలతో సమావేశాలు నిర్వహించనున్నది. అభివృద్ధి పథంలో ముందుకు పోతున్న తెలంగాణ రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్తు పరిశ్రమలకు తోడ్పాటు, వివిధ పరిశ్రమల్లో భాగస్వామ్యం వంటి అంశాలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆ దేశ ప్రముఖ కంపెనీల, పారిశ్రామికవేత్తలతో చర్చించనున్నారు.ఇక ఈ పర్యటనలో భారత రాయబారి సిబి జార్జి ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి కి జపాన్ దేశంలో గల పరిశ్రమలు, తెలంగాణలో పెట్టుబడులకు, భాగస్వామ్య పరిశ్రమలకు గల అవకాశాలపై సంక్షిప్తంగా వివరించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి గౌరవార్థం భారత రాయబార కార్యాలయం ఏర్పాటు చేసిన ఇందులో భట్టి విక్రమార్క ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.1వ తేదీ ఉదయం పెట్టుబడులతో వచ్చే కంపెనీల తో రౌండ్ టేబుల్ సమావేశం , వివిధ పారిశ్రామిక వేత్తల తో విడివిడిగా సమావేశాలు, అదే రోజు సాయంత్రం యమాంషి గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ సందర్శన లో ఉప ముఖ్యమంత్రి పాల్గొంటారు. 2 వ తేదీన తోషిబా, కవాసాకి ,యాక్లహామ పరిశ్రమలను సందర్శిస్తారు. అదే రోజు రాత్రి ఒకాస చేరుకోని 3తేదీన పానాసోనిక్ హెడ్ క్వార్టర్స్ సందర్శిస్తారు.అనంతరం నాలుగో తేదీన రాష్ట్ర బృందం హైదరాబాద్ కు చేరుకోనుంది.

## నేనడిగిన ప్రశ్నకే సమాధానం చెప్పండి

### హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు చురక

- చంచల్ గూడ, చర్లపల్లి పంపిస్తే అర్థం అవుతుంది
- తీవ్ర స్థాయిలో ద్వజం

**టీ మీడియా,సెప్టెంబర్ 30,హైదరాబాద్ బ్యూరో :**



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా కూల్చివేతలపై యజమానులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. సోమవారం బాధితుల పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరిపింది. హైడ్రా కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కోర్టుకు హాజరయ్యారు. వర్చువల్‌గా హైకోర్టుకు హాజరై వివరణ ఇచ్చారు.కూల్చివేతలకు రంగానాథ్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.ఆదివారం రోజు ఎందుకు కూల్చివేతలు చేశారో చెప్పండి అని సూటిగా ప్రశ్నించింది. పత్రికలు చెప్పినట్లు వింటున్నారా లేక లా ఫాలో అవుతున్నారా అని నిలదీసింది. నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేతలు చేస్తున్నారో చెప్పాలని హైడ్రాకు ఉన్న చట్టబద్ధత ఏంటో చెప్పండి అంటూ కమిషనర్‌ను గట్టిగా నిలదీసింది ధర్మాసనం.మీరు చట్టాన్ని ఉల్లఘించి కూల్చివేతలు చేస్తున్నారు అంటూ న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేశారు.చార్మినార్‌ను కూల్చాలని అక్కడి ఎమ్మార్వో చెబితే మీరు కూల్చేస్తారా.నేనడిగిన ప్రశ్నకు మాత్రమే సమాధానం చెప్పండి. జంప్ చేయకండి. అమీన్ పూర్‌పై మాత్రమే మాట్లాడండి కావూరి హిల్స్ గురించి నేను అడగలేదు అంటూ హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు చురకంటించింది.హైడ్రా కేవలం కూల్చివేతలపైనే దృష్టి పెడుతున్నట్లు హైకోర్టు భావిస్తుందన్నారు.అక్రమ కట్టడాలు కడుతుంటే నిలుపుదల చేయాలని.. లేదా సీజ్ చేయాలని కానీ నిబంధనలు ఉల్లగించి ఆదివారం కూల్చడం ఏంటి అని ప్రశ్నించింది.ఆదివారం ప్రశాంతంగా ఫ్యామిలీతో గడపకుండా అధికారులు కక్షగట్టి కూల్చివేస్తున్నారని మండిపడింది. హైడ్రాను అభినందిస్తున్నాం కానీ హైడ్రా వ్యవహరిస్తున్న తీరు బాగులేదు అని హైకోర్టు పేర్కొంది.

### కామన్ మ్యాన్‌కు ఏం మెసేజ్ ఇస్తున్నారు


అంత హడావుడి ఎందుకు ఆదివారం కూల్చివేతలు.అక్రమ నిర్మాణాలు జరిగితే గ్రామపంచాయతీ స్పందించాలి. గ్రామపంచాయతీ చర్యలు తీసుకోవాలి.కట్టకుండా

మిగతా 3లో..

## డీఎస్సీ పోస్టులకు 1:3 నిష్పత్తిలో వెరిఫికేషన్

## అక్టోబర్ 9న నియామకపత్రాలు

- సీఎం రేవంత్ రెడ్డి




**టీ మీడియా,సెప్టెంబర్ 30,హైదరాబాద్:**

తెలంగాణ డీఎస్సీ ఫలితాలు ముఖ్యమంత్రి రేవంత్ చేతుల మీదగా సోమవారం (సెప్టెంబర్ 30) విడుదలైన సంగతి తెలిసిందే. డీఎస్సీ-2024 ఫలితాల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 11,062 టీచర్ ఉద్యోగాల భర్తీకి విశేష కృషి చేసిన అధికారులకు నా అభినందనలు.1:3 ప్రాతిపదికన ఫలితాలు ఫలితాలు విడుదల చేసాం. దసరా లోపు ఫైనల్ నియామకాలు పూర్తి చేస్తాం. అంతా సవ్యంగా జరిగితే అక్టోబర్ 9న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందిస్తాం. గత ప్రభుత్వం పదేళ్లలో ఒకే ఒక సారి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. పదేళ్లలో వాళ్లు చేపట్టిన ఉపాధ్యాయ నియామకాలు కేవలం 7,857 మాత్రమే. విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచన గత ప్రభుత్వానికి లేదు. మేం అధికారంలోకి రాగానే ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియ మొదలు పెట్టాం. విద్యకు మా ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుంది. నిర్వహణ నుంచి నియామకాల వరకు 65 రోజుల్లో 11062 ఉద్యోగాల నియామకాలు పూర్తి చేస్తున్నాం. ఇది విద్యపై మా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి. తెలంగాణలో పేదలకు విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్నదే మా ఆకాంక్ష.అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లోనే 30వేల ఉద్యోగాల నియామక పత్రాలు అందించాం. నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకుని టెట్ నిర్వహణ తర్వాతే డీఎస్సీ నిర్వహించాం. టీజీపీస్సీని ప్రక్షాళన చేసాం. త్వరలోనే గ్రూప్ 1 ఫలితాలు ప్రకటించి తెలంగాణ పునర్నిర్మాణంలో వారిని కూడా భాగస్వామ్యం చేస్తాం. మొదటి ఏడాదిలోనే 60 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తున్నాం. టీచర్ ఉద్యోగం కేవలం ఒక ఉద్యోగం కాదు.. అది ఒక భావోద్వేగం. గత పదేళ్లలో విద్య నిర్లక్ష్యానికి గురైంది. మేం వచ్చాక విద్యాశాఖకు నిధుల కేటాయింపు పెంచాం. భవిష్యత్ లో మరిన్ని నిధులు కేటాయిస్తాం. గత ప్రభుత్వం స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించలేదు. అందుకే మా ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తోంది. 100 నియోజకవర్గాల్లో 20 నుంచి 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నాం. పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్ మధిరలో ఏర్పాటు చేస్తున్నాం. గత ప్రభుత్వం టీచర్ల పదోన్నతులు, బదిలీలు చేపట్టలేదు. మా ప్రభుత్వం వివాదాలకు తావు లేకుండా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసింది.కొన్ని రాజకీయ పార్టీల మీడియాలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులపై మాపై దుష్ప్రచారం చేస్తున్నాయి. పదేళ్లు ప్రభుత్వంలోఉన్నవాళ్లు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారు. అందుకే ఈ ఉపద్రవం వచ్చింది. వాటన్నింటిని పరిష్కరించుకుంటూ మేంముందుకెళుతున్నాం. విద్యపై పెట్టేది ఖర్చు కాదు.. పెట్టుబడి అని మేం భావిస్తున్నాం. విద్యార్థుల సంఖ్యతో ప్రమేయంలేకుండా ప్రభుత్వ పాఠశాలలు నిర్వహిస్తాం. పేదలకు విద్య అందించడమే మా విధానం. పాఠశాల ఫీజుల నియంత్రణపై త్వరలో కమిటీ వేస్తామని సీఎం రేవంత్ ఈ సందర్భంగా తెలిపారు.

# దేవుళ్లను రాజకీయాలలోకి లాగకండి


## • సుప్రీం కోర్టు



**టీ మీడియా,సెప్టెంబర్ 30,తిరుపతి**

శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం వివాదంపై సుప్రీంకోర్టు ఘాటుగా స్పందించింది. దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని హితవుపలికింది. లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించారనడానికి ఆధారాలు ఏమైనా ఉన్నాయా అని ప్రభుత్వం తరపున న్యాయవాది ముకుల్ రోహత్గీని జస్టిస్ బి ఆర్ గవాయ్, జస్టిస్ కేవీ వి బాలకృష్ణన్ ధర్మాసనం ప్రశ్నించింది.తిరుమల స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు ఆరోపణలు నేపథ్యంలో ఈ అంశంలో నిజం నిగ్గూ తేల్చాలంటూ బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి, వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. వీటిపై సుప్రీంకోర్టులో నేడు విచారణ జరిపింది. కల్తీ నెయ్యిని లడ్డూలో వాడారో లేదో పూర్తిగా తెలియకుండా ముఖ్యమంత్రి ఎలా ప్రకటన చేస్తారని సుప్రీంకోర్ట్ నిలదీసింది. ఈ అంశంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) నియమించిన అనంతరం కల్తీ నెయ్యిపై మీడియా ముందు ప్రకటన చేయడంపై ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇటువంటి ప్రస్తుత పరిస్థితుల్లో కొత్తగా నియమించిన సిట్ సరిగ్గా విచారణ జరపగలదా? అన్న సందేహాలు ఉన్నాయని న్యాయస్థానం పేర్కొంది.స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించినట్లు ఎలా తెలిసిందంటూ సుప్రీంకోర్ట్ సందేహం వ్యక్తం చేసింది. అలాగే స్వామి వారి ప్రసాదం లడ్డూని పరీక్షల కోసం ల్యాబ్‌కి ఎప్పుడు పంపారని ముకుల్ రోహత్గీని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపితే బావుంటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. పిటిషనర్ల తరుపున సీనియర్ న్యాయవాది రాజశేఖర్ రావు తన వాదనలు వినిపించారు. అనంతరం ఈ కేసు విచారణను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ బాలకృష్ణన్ ధర్మాసనం గురువారానికి వాయిదా వేసింది.

# నిలిచిన అభివృద్ధి పనులు ప్రారంభించి పూర్తి చేయాలి



**టీ మీడియా, సెప్టెంబర్ 30, వనపర్తి బ్యూరో :**

వనపర్తి జిల్లా కేంద్రాన్ని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి భవిష్యత్తు తరాల కోసం ముందు చూపుతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అందులో ముఖ్యంగా పట్టణానికి తలమానికంగా కేంద్రప్రభుత్వ ఆధీనములో ఉన్న ఫారెస్ట్ నుండి అనుమతులు పొంది బై పాస్ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. ఇట్టి జై పాస్ రోడ్డు పనులు పెండింగ్లో ఉన్నాయి పట్టణ ప్రజల చిరకాల స్వప్నం అయిన రోడ్ల విస్తరణ విజయవంతం చేయగా 10శాతం పనులు అనగా కన్యకాపరమేశ్వరి ఆలయం ఎదురుగా రామా టకీస్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు పాలిటెక్నిక్ కళాశాల నుండి మర్రికుంట వరకు రోడ్డు విస్తరణ పనులు పెండింగ్లో ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే మాట ఇచ్చిన ప్రకారం కన్యకాపరమేశ్వరి ఆలయం ముందు రోడ్ విస్తరణ పనులు నిలిపితే ప్రత్యామ్నాయంగా గుడికి కేటాయించిన స్థలం ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు డబల్ బెడ్ రూమ్స్ నిర్మించిన చిట్యాల, పీర్లగుట్ట, రాజపేట, పెద్దగూడెం దగ్గర మౌలిక వసతులు లేక లబ్దిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టౌన్ హాల్ వినియోగంలోకి తీసుకురావాలి. కోట్ల రూపాయలు నిధులతో చేపట్టిన సామూహిక మార్కెట్ యార్డ్ కూడా వినియోగంలోకి తీసుకురావాలి. ఏకో పార్కు దగ్గర నిర్మించిన వే సైడ్ మార్కెట్ కూడా వినియోగంలోకి తీసుకురావాలి. మారెమ్మకుంట కందకంలో నిర్మాణములో ఉన్న కూరగాయల మార్కెట్ పనులు పూర్తి చేయాలి. ఈ అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయినాయని గతములో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తమరికి విజ్ఞప్తి చేశారు. కాబట్టి దయచేసి పై.సూచించిన అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలి అని బి.ఆర్.ఎస్ పార్టీ తరపున జిల్లా కలెక్టర్ కి విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించిన వారిలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్,పట్టణ అధ్యక్షులు పి రమేష్ గౌడ్,మార్కు ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్ జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్,ప్రధాన కార్యదర్శి గంధం.పరంజ్యోతి, గులాం ఖాదర్ ఖాన్, నీల స్వామి,వేణు గోపాల్ నాయుడు, సయ్యద్. జమీల్,స్టార్.రహీమ్, పాషా, చిట్యాల. రాము,లక్ష్మణ్ గౌడ్,శివప్రసాద్ గౌడ్, సిరివాటి.శంకర్,ఎం.డి.అలీం,ఎం.డి.నవాజ్, తదితరులు ఉన్నారు.



# చెకుముకిసైన్స్ సంబరాలు

**టీమీడియా, సెప్టెంబర్ 30, పెద్ద దోర్నాల:**

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దోర్నాలలోనీ ఇండియన్ హైస్కూల్ నందు చెకుముకి సైన్స్ సంబరాలు పరీక్ష సోమవారం నాడు నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రాలను ఇండియన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ షేక్ చిన్న పీరా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ఏనుగుల రవికుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు చెకుముకి సైన్స్ సంబరాల పరీక్ష ఉపకరిస్తుందన్నారు. ప్రజల్లోని మూఢనమ్మకాలను పారద్రోలేందుకు జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తుందన్నారు. ఇండియన్ స్కూల్ కరస్పాండెంట్ ఎం మల్లికార్జునరావు మాట్లాడుతూ... విద్యార్థుల్లో చెకుముకి సంబరాలు వంటి పరీక్షల్లో పాల్గొనడం వల్ల సైన్స్ పట్ల ఆసక్తి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు దగ్గుల రవీంద్రారెడ్డి, బోటుకు యల్లరావు, ఆ పాఠశాల ఉపాధ్యాయులు కంచర్ల రాఘవ, చల్లా బిందు, అరుణ , మంత్రునాయక్ .తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా అంబేద్కర్ భవనం

**టీ మీడియా, సెప్టెంబర్ 30, వనపర్తి బ్యూరో :**



వనపర్తి పట్టణంలోని ఐదోవార్డ్ ఇందిర కాలనీలో డాక్టర్ బి. ఆర్.అంబేద్కర్ భవనాన్ని కాలనీ వాసుల కోరిక మేరకు దయానంద్ ముదిరాజ్ సందర్శించారు. భవనం నిర్మించారు కాని దాని పర్యవేక్షణలో లోపాలు కారణంగా కొందరు ఆకతాయిలు అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది.బడుగు బలహీన వర్గాల మహానీయుని పేరు పెట్టుకున్న భవనాన్ని ఈ విధంగా చూడవలసి వస్తుందని అనుకోలేదు. వివిధ సంస్కృతిక కార్యక్రమాలకు, సభలకు ఏర్పాటు చేసుకోవాల్సిన భవనం నిరుపయోగంగా మారిపోయింది. తక్షణమే పోలీస్ శాఖ స్పందించి అకతాయిలను గుర్తించి వారికి కౌన్సిలింగ్ చేయాలని కోరారు. కాలనీ ప్రజలు ఉన్నత అధికారులకు ఫిర్యాదు ఇచ్చిన వారిపై దాడులకు కూడా పాల్పడుతున్నారని తెలుస్తు%శీ%ది. అదే విధంగా కందకం గడ్డలో కూడా ఇదే పరిస్థితి ఉంది భాధ్యత కల్గిన జర్నలిస్ట్ లు వార్తలు రాస్తున్న మున్సిపల్ అధికారులలో ఎలాంటి చలనం ఎందుకు రావట్లేదు. యాంటి సోషల్ ఆక్టివిటీస్ ఏరియాలో భద్రత కట్టుదిట్టం చేయాలని కోరారు.

# మారాలని ఉంది.. కానీ మారలేకున్నా..'

## • సూసైడ్ లేఖలో ఆఖరి మాటలు




**టీ మీడియా, సెప్టెంబర్ 30,కొడిమ్యాల :**

అమ్మ నన్ను క్షమించు%ొ%.చెడు వ్యసనాలకు బానిస అయ్యాను.. మారాలని ఉన్నా మారలేక పోతున్నాను.. అందుకే సూసైడ్ చేసుకుంటున్నాను.. నా లాగా మత్తుకు ఎవ్వరూ బానిసలు కాకండి" అని ఓ యువకుడు సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు.జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం సూరంపేట గ్రామానికి చెందిన నక్క గంగులు, సత్తయ్య దంపతులకు ఇద్దరు కొడుకులు.. పెద్ద కొడుకు దుబాయికి వెళ్లగా, చిన్నకొడుకు సాయి ఇంటి వద్దనే ఉంటున్నాడు. వ్యవసాయ పనులు జీవించే సాయ కి వివాహం అయ్యి ఒక కొడుకు ఉన్నాడు. సాయి మద్యంతో పాటు ఇతర వ్యసనాలకి బానిస అయ్యాడు. ఎంత చెప్పినా మారకపోవడంతో కొడుకుని తీసుకొని భార్య దీక్షిత పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అతడు మరింత దిగజారిపోయాడు. ఆ అలవాట్లను ఎంత మానుకుందామనుకున్నా అతడి వల్ల కాలేదు. దీంతో నిరాశకు లోనై ఇంట్లో ఎవరూ లేని సమయంలొ ఉరి వేసుకుని అత్మహత్య చేసుకున్నాడు. తన లాగా మత్తుకు ఎవ్వరూ బానిసలు కావద్దని బంగారం లాంటి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని.. యువతకి సందేశం ఇస్తూ సాయి తన చివరి మాటలని సూసైడ్ లెటర్‌లో రాశాడు. సాయి రాసిన చివరి మాటలని అతడి స్నేహితులు ఫ్లెక్సీ రూపంలో గ్రామంలో ఏర్పాటు చెశారు. ఆ ఫ్లెక్సీ గ్రామంలో చర్చనీయాంశం గా మారింది. అందర్నీ ఆలోచింజేస్తోంది.

# జిల్లా స్థాయి వాలీబాల్ పోటిలకు క్రీస్తు జ్యోతి విద్యార్థులు ఎంపిక

**టీ మీడియా, సెప్టెంబర్ 30, మహానంది:**



మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని క్రీస్తు జ్యోతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాలకరస్పాండెంట్ సిధిన్ సాముయెల్ , ప్రిన్సిపల్ జీనా బాబు పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ... శ్రీశైలం నియోజకవర్గం లోని ఆత్మకూరులో నిర్వహించినకాన్స్టిట్యూషన్సిలెవెల్ అండర్ 14 కాంపిటీషన్లో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు పి.యశ్వంత్ 8 వ తరగతి, బి.సతీష్ కుమార్ 7వ తరగతి విద్యార్థులు ఎంపిక కావడం జరిగిందన్నారు. జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ సిధిన్ సాముయెల్, ప్రినిపాల్ జీనాబాబు, వ్యాయమ ఉపాధ్యాయుడు నరేంద్ర బాబు, ఉపాధ్యాయులు అభినందించారు. జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక కావడం సంతోషకరమన్నారు.

# బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్

**టీ మీడియా,సెప్టెంబర్ 30,కంభం:**



ప్రకాశం జిల్లా కంభం మండలం చిన్న కంభం గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని ఎస్ఐ నరసింహారావు అరెస్ట్ చేశారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తి వద్ద నుండి 40 క్వార్టర్ల (180 ఎంఎల్) మద్యం బాటిళ్లు మరియు మూడు 750 ఎంఎల్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషక్ కి తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరసింహారావు మాట్లాడుతూ మండల పరిధిలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# గ్రామంలో బడి నిద్ర కార్యక్రమం


**టీ మీడియా, సెప్టెంబర్ 30, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం యాపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు సోమవారం బడినిద్ర కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పలుస శంకర్ గౌడ్, ఉపాధ్యాయులు మైనోద్దీన్, ఈశ్వర్ రెడ్డి , శ్రీధర్,వెంకటేశ్వర్లు,రాత్రి 7 గంటల నుంచి గ్రామంలోని విద్యార్థుల ఇళ్లను సందర్శించి విద్యార్థులు చదువు గురించి వివరించారు. పేరెంట్స్ మీటింగ్ లో అందరు తల్లిదండ్రులు హాజరు కావలని కోరారు.ఇంటింటికీ వెల్లి తలిదండ్రుల ను కలసి మాట్లాడడం జరిగింది. ప్రధానోపాధ్యాయుడు పలుస శంకర్‌గౌడ్ మట్లాడుతూ తల్లిదండ్రుల సమావేశంలో తల్లిదండ్రులు హాజరు కావటం లేదు ఉపాధ్యాయుల అభిప్రా యం ప్రకారం బడి నిద్ర కార్యక్రమం చేదామని కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఇంటీ దగ్గర హెూమ్ వర్క్ చేహించాలనీ, సమ్మేటివ్ 1 పరీక్షలకు చదవాలి. తల్లితండ్రులు కు ఉన్న చెడ్డ అలవాట్లను చేపకుడదని , సిగరెట్, మందు ఇలాంటివి పిల్లలకి చెప్పకూడదని చెప్పారు.స్టూడెంట్స్ కు సెపరేట్ స్టడీ కార్నర్ వేర్పట్టు చెయ్యాలి. సెల్‌ఫోన్ టీవీ కి దూరంగా ఉంచాలి అన్నారు.తల్లిదండ్రులు పిల్లలతో కూడా గడపాలి. అన్నారు.ఈ కార్యక్రమం చూసి తల్లిదండ్రులు చాలా సంతోషంగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు స్వరాజ్యం బాబు రెడ్డి, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాసరావుకు సన్మానం

**టీ మీడియా, సెప్టెంబర్ 30, పెద్ద దోర్నాల :**



పెద్ద దోర్నాల మండల పరిషత్ కార్యాలయంలో.ప్రస్తుతం జరుగుతున్న సాధారణ బదిలీల్లో భాగంగా దోర్నాల జూనియర్ అసిస్టెంట్ ఎం . శ్రీనివాసరావు యర్రగొండపాలెం ఎంపీడీఓ కార్యాలయానికి బదిలీపై వెళ్తుండగా దోర్నాలలో ఎంపీపీ భర్త గుమ్మా పద్మజా యల్లేష్, ఎం.ఈ.ఓ. బి మస్తాన్ నాయక్. ఎంపీటీవో ఎం. నాసర్ రెడ్డి. పంచాయతీ సెక్రెటరీ. మోహన్ రావు. కృప చారి. బ్రహ్మాచారి. సచివాలయం సెక్రెటరీ..వైసీపీ నాయకులు ఒంటేరు రవణయ్య, వెంకటరెడ్డి, కాశీరాములు .తదితరులు శాలువాతో సత్కరించి పూలమాల వేసి సన్మానించారు.

# పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

## • ఆర్ ఐ అన్వేష్

**టీ మీడియా,సెప్టెంబర్ 30,ఎండపల్లి:**

పౌర హక్కులకు భంగం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు,ఆర్ ఐ, మండలంలోని అంబారిపేట గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ ఐ అన్వేష్ మాట్లాడుతూ... రాజ్యాంగం కల్పించిన పౌర హక్కుల పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలనిఅంటరానితనాన్ని నిర్మూలించడమే పౌర హక్కుల దినోత్సవం ముఖ్య ఉద్దేశం అని పూర్వం స్వాతంత్రం రాక ముందు అంటరానితనం ప్రభలంగా ఉండేదని ఇప్పుడు దాదాపుగా తగ్గిపోయిందని తెలియజేశారు.గ్రామలాల్లో ప్రతి ఒక్కరు సోదర భావంతో ఉండాలని, స్వేచ్ఛ, సమానత్వం కలిగి ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుండేటి గోపిక జితేందర్ రెడ్డి, ఎంఈఓ రాంచంద్రం,ఎంపీఓ శ్రీనివాస్, ఎస్సీ వెల్ఫేర్ వార్డెన్ అప్సర్, పంచాయతీ కార్యదర్శి గోపు భీమన్న, ఐకెపి సీఓ నక్క మురళి, ఆశలు , అంగన్వాడీ సిబ్బంది తో పాటు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

## • అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్

**టీ మీడియా, సెప్టెంబర్ 30, వనపర్తి బ్యూరో :**



ప్రజావాణి ఫిర్యాదులతో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చే ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. సోమవారం ఉదయం అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్ తో కలిసి ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలు తమ సమస్యల పరిష్కారానికై ముఖ్యమంత్రి ప్రజావాణిలో చేసుకున్న ఫిర్యాదులను అక్టోబర్, 3 నాటికి పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రజావాణి నుండి జిల్లాకు ఇప్పటి వరకు ఆయా శాఖలకు సంబంధించిన 297 ఫిర్యాదులు రావడం జరిగిందని, వాటిని సంబంధిత శాఖలకు పంపించగా ఇప్పటి వరకు 114 ఫిర్యాదులు పరిష్కారం అయ్యాయని ఇంకా 183 ఫిర్యాదులు ఆయా శాఖల్లో పెండింగ్ లో ఉన్నట్లు తెలియజేశారు. ఎక్కువగా రెవెన్యూ శాఖలో పెండింగ్ లో ఉన్నాయని వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడమే కాకుండా ఫిర్యాదు దారుని పూర్తి వివరాలు, సమస్య పరిష్కారంతో ఫిర్యాదుదారుని మనోభావాలు, స్పందనను సమర్పించాల్సిందిగా సూచించారు. అదేవిధంగా జిల్లా ప్రజావాణి ఫిర్యాదులను సైతం ఎప్పటికప్పుడు పరిష్కరించి ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. సోమవారం మొత్తం 55 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా అధికారులు, మండలాల నుండి వెబ్ కాన్ఫరెన్స్ ద్వారా తహశీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

# పీఎం విశ్వకర్మ యోజన వెంటనే అమలు పరచాలి

## • బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, మండల ఇంచార్జ్ పెద్దిరాజు

**టీ మీడియా, సెప్టెంబర్ 30, వనపర్తి బ్యూరో :**



ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను గ్రామాలలో వెంటనే అమలు పరచాలని కోరుతూ ప్రజావాణిలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి%ః% వనపర్తి మండల ఇంచార్జ్ పెద్దిరాజు మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీల రాకతో గ్రామీణ ప్రాంతాల్లో కనుమరుగైపోతున్న చేతివృత్తులు కమ్మరి, కుమ్మరి,ఎరుకలి,చాకలి,మంగలి, వడ్రంగి, దర్జీ,చేపల వేట, చెప్పులు కుట్టడం, మెకానిక్, వెల్డింగ్ తదితర 14 రకాల చేతివృత్తుల వారికి చేయూతనందించి ఆర్థిక పరిపుష్టి సాధించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనలో మండలంలో వందలాదిమంది దరఖాస్తులు చేసుకున్నారని గ్రామపంచాయతీలలో నోడల్ అధికారిగా దరఖాస్తులను పరిశీలించి ధ్రువీకరించాల్సిన పంచాయతీ కార్యదర్శులు విలేజ్ లాగిన్ ఓపెన్ కావడం లేదని లాగిన్ ఐడి, పాస్వర్డు అప్డేట్ కావడం లేదని, ఎంపీడీవో, డిపిఓ ఆఫీసులో లాగిన్ అప్డేట్ అవుతుందని చేబుతూ బిపిఎల్ కుటుంబాలకు చెందిన చేతివృత్తుదారులు విశ్వకర్మ యోజనలో లబ్ధి పొందకుండా పంచాయతీ కార్యదర్శులు అడ్డుకుంటున్నారని జిల్లా కలెక్టర్ గారు సదరు విషయమై తగు చర్యలు తీసుకుని గ్రామాలలో విశ్వకర్మ యోజనను వెంటనే అమలుపరిచే విధంగా ఆదేశాలు జారీ చేయాలని భారతీయ జనతా పార్టీ తరపున చిట్యాల గ్రామ విశ్వకర్మకు దరఖాస్తు చేసిన గ్రామస్తులతో కలిసి జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి పోతు శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షులు కాటమోని శ్రీనివాస్ గౌడ్, విశ్వకర్మ దరఖాస్తుదారులు పోతు తిరుపతయ్య, కొక్కు మన్యం, వడ్డే వెంకటయ్య, పెద్ది శేఖర్, వాకిటి రాములు, మండ్ల రామకృష్ణ, కుమ్మరి వీరేష్, ఉదార్ల యాదగిరి, పెద్ది రమేష్, గొల్ల అంజి , మండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# దసరాకు ఆరువేల ప్రత్యేక బస్సులు

## • టీజీఎస్ ఆర్టీసీ యాజ మాన్యం



**టీ మీడియా, సెప్టెంబర్ 30,హైదరాబాద్ :**

దసరా పండుగను పురస్క రించుకొని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 6వేల ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచ నుంది,హైదరాబాద్ శివారు ప్రాంతాల నుంచి దసరాకు ప్రత్యేక బస్సులను నడపా లని టీజీఎస్ ఆర్టీసీ యాజ మాన్యం నిర్ణయించింది. సొంతూళ్లకు వెళ్లే వారి కోసం ఎంజీబీఎస్, జేబీ ఎస్, ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, సంతోష్ నగర్, కేపీహెచ్‌బీ, తదితర ప్రాంతాల నుంచి స్పెషల్ సర్వీసులను అందుబాటు లో ఉంచనుంది. ఐటీ కారిడార్ ఉద్యోగుల సౌకర్యార్థం గచ్చిబౌలి ఓఆర్ఆర్ మీదుగా విజయవాడ, బెంగళూరు, తదితర ప్రాంతాలకు బస్సులను నడిపేలా ప్లాన్ చేసింది.దసరా పండుగకు ప్రత్యేక బస్సులు, రద్దీ ప్రాంతాల్లో ప్రయాణికులకు కల్పించా ల్సిన సౌకర్యాలపై తమ క్షేత్ర స్థాయి అధికారులతో టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ వర్చ్వల్‌గా సమావేశమయ్యారు. ప్రయాణికులను సురక్షి తంగా గమ్యస్థానాలకు చేరవేయడంలో ఆర్టీసీ ఉద్యోగుల కృషి అభినంద నీయమన్నారు. గత దసరాతో పోల్చితే ఈ సారి మహాలక్ష్మి పథకం అమలు వల్ల రద్దీ ఎక్కువ గా ఉండే అవకాశముందని, గతంలో మాదిరిగానే ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఉద్యోగులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. రద్దీని బట్టి ప్రత్యేక బస్సులను అందు బాటులో ఉంచాలన్నారు. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రజలకు రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా టీజీఎస్ఆర్టీసీ యాజమా న్యం అన్ని ఏర్పాట్లు చేసిందని, ఈ పండుగలకు 6 వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1 నుంచి 15వ తేది వరకు ఈ ప్రత్యేక బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయ ని,వివరించారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించినట్లు చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రం నలుమూలలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు ఈ ప్రత్యేక బస్సులు నడుపు తున్నట్లు వివరించారు. అక్టోబర్ 12న దసరా పండుగ ఉన్నందున.. 9, 10, 11 తేదిల్లో ప్రయాణి కుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముందని, ఆయా రోజుల్లో అవసరాలకు అనుగుణంగా మరిన్నీ ప్రత్యేక బస్సులను నడపాలన్నారు. రద్దీ రోజుల్లో ఎన్‌హెచ్ఏఐ అధికారులతో మాట్లాడి ఆర్టీసీ బస్సులకు టోల్ ప్లాజా వద్ద ప్రత్యేక లేన్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు..

# వార్డు సమస్యలను పరిష్కరించే దిశగా పాటుపడతా

## • వార్డులో పర్యటించిన మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్

**టీ మీడియా, సెప్టెంబర్ 30, వనపర్తి బ్యూరో :**






ప్రజలకు హామీ ఇచ్చారు.అభివృద్ధి కాలేదు కానీ అవినీతి వలన ఉన్న రోడ్లు పాడయ్యాయి. మాగోడు ఎవరు తీరుస్తారు అంటూ 30వ వార్డు ప్రజల ఆవేదన వ్యక్తం చేశారు. ఐజయ్య కాలనీలో రోడ్ నెంబర్ 4 దగ్గర ఒక అక్రమ పర్మిషన్తో అపార్ట్మెంట్ కట్టి చుట్టుపక్కల రోడ్డు,కాలువలను ధ్వంసం చేస్తే నాలుగు సంవత్సరాలుగా పట్టించుకోకుండా వారికి కొమ్ము కాస్తూ ఆ పాడైన రోడ్డును, కాలువలను పట్టించుకోని మాజీ వైస్ చైర్మన్ . వారికి తన అండతో అక్రమ అనుమతి ఇప్పించాడానే వాదన కూడా ఉంది..రాజకీయ దురుద్దేశంతో రెండు పెద్ద ఊర్ల కంటే ఎక్కువగా మెయిన్ రోడ్డుకు దూరంగా ఏర్పాటు చేసిన 30వ వార్డు.వార్డు అభివృద్ధి చేయకుండా, వార్డుకు అన్యాయం చేసిన మాజీ వైస్ చైర్మన్, రెండు నెలల్లో మాజీ కౌన్సిలర్ కాబోతున్న నాయకుడు. మా పార్టీ అధికారంలో ఉంది, మా మంత్రితో పక్కనే ఉన్నా నేనే చైర్మెన్ అవుతా అంటూ వార్డు ప్రజలను మభ్యపెట్టి అధికారం అడ్డు పెట్టుకొని గెలిచిన మాజీ వైస్ చైర్మన్ గెలిచిన తర్వాత వార్డును పట్టించుకోలేదు ఎందుకని, 30 వ వార్డు ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. సోమవారం వార్డులో పర్యటించిన మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్ త్వరలో వార్డ్ మొత్తం పరిశీలించి వార్డు సమస్యలను ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి దృష్టికి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వార్డు సమస్యలను పరిష్కరించే దిశగా పాటుపడతానని ప్రజలకు హామీ ఇచ్చారు.



# సిటీ హెూటల్‌ను ప్రారంభించిన మున్సిపాల్ చైర్మన్

**టీ మీడియా, సెప్టెంబర్ 30, వనపర్తి బ్యూరో :**

వనపర్తి జిల్లా కేంద్రంలో శ్రీ రంగ టాకీస్ పక్కన కొత్తకోట రోడ్డు లో నూతన సిటీ హెూటల్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ పుట్టపాక మహేష్ , వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ చందర్ , వనపర్తి నియోజకవర్గం సమన్వయకర్త లక్కాకుల సతీష్ , ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్స్ విభూతి నారాయణ , చీర్ల సత్యం సాగర్, జంపన్న, నక్క రాములు, చంద్రకళ, ఎల్ఐసి కృష్ణ, మాజీ కౌన్సిలర్ కృష్ణ బాబు, టిపిసిసి వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ద్యారపోగు వెంకటేష్, ఓబీసీ పట్టణ అధ్యక్షులు బొంబాయి మన్నెంకొండ, ఏ ఆర్ గౌడ్, ఆరిఫ్ ఇర్ఫాన్, ఎండి ఫజల్, అస్లాం, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# అమ్మ కోసం యాప్ పై ఏఎన్ఎంలకు శిక్షణ

**టీ మీడియా, సెప్టెంబర్ 30, వనపర్తి బ్యూరో :**

జిల్లాలోని వైద్యాధికారులు ఏఎన్ఎం ల కొరకు ప్రవేశపెట్టిన అమ్మ కోసం యాప్ గురించి సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరం నందు వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేసే ఏఎన్ఎం లందరికీ శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణలో గర్భవతులలో ప్రమాదకర పరిస్థితులను త్వరితగతిన గుర్తించడం, చికిత్స అందించడం, తద్వారా శిశు మాతృ మరణాలను అరికట్టడం , తల్లి బిడ్డల సంరక్షణ కొరకు ఈ యాప్ ను ప్రత్యేకంగా రూపొందించడం జరిగిందని ప్రతి ఒక్కరూ బాధ్యతతో ప్రమాదకర లక్షణాలున్న గర్భవతులను గుర్తించి ఇందులో నమోదు చేయాలని జిల్లా మాతా శిశు సంరక్షణ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఝాన్సీ రాణి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ మంజుల జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్, డాక్టర్ శ్రీ హరినాథ్ రెడ్డి, డాక్టర్ నదియా సాదత్ పాల్గొని శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని నర్సింగరావు ఎంసిఎచ్ సూపర్వైజర్, జిల్లా డాటా మేనేజర్ వెంకటకృష్ణారెడ్డి, పరశురాం డాటా ఎంట్రీ ఆపరేటర్ , మిగతా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పాల్గొనడం జరిగింది.

# నరమాంస భక్షనకు అలవాటు పడిన చిరుత..



- 11 రోజుల్లో ఏడుగురు మృతి

**టీ మీడియా, సెప్టెంబర్ 30, ఉదయ్‌పూర్:**
రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లో నరమాంస భక్షనకు అలవాటు పడిన చిరుత వరుస దాడులకు పాల్పడుతోంది. ఇప్పటికే దీని దాడిలో పలువురు ప్రాణాలు కోల్పోగా.. తాజాగా మరో ప్రాణాన్ని బలి తీసుకుంది. ఓ ఆలయ పూజారిపై దాడి చేసిన చిరుత తీవ్రంగా గాయపరిచింది. దీంతో అతడు మృతి చెందాడు. గత 11 రోజుల వ్యవధిలో ఏకంగా ఏడుగురు మరణించడంలో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. వివరాల్లోకి వెళితే..ఉదయ్‌పూర్‌లోని గోంగుడా గ్రామంలో గత కొంత కాలంగా నరమాంస భక్షనకు అలవాటుపడిన చిరుత వరుస దాడులకు పాల్పడుతోంది. ఆదివారం రాత్రి గ్రామంలోకి ప్రవేశించిన చిరుత.. ఓ ఆలయ పూజారిపై దాడి చేసింది. పూజారి మహరాజ్ విష్ణు గిరి ఆదివారం రాత్రి ఆలయంలో నిద్రిస్తున్న సమయంలో ఈ దాడి చేసినట్లు తెలుస్తుంది. చిరుత పూజారిని అడవిలోకి లాక్కెళ్లి దాడి చేసింది. ఈ దాడిలో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సోమవారం తెల్లవారు జామున పూజారి మృత దేహాన్ని అడవిలో కనుగొనడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తాజా దాడితో గత 11 రోజుల్లో ఇది ఏడో మరణం కావడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది.

చిరుతపులి వరుస దాడుల నేపథ్యంలో పోలీసులు, అటవీశాఖ అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో ఉచ్చులు బిగించారు. గత కొన్ని రోజులుగా కొన్ని చిరుతలు పట్టుబడ్డాయి. మరోవైపు చిరుత వరుస దాడులతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే సమీప గ్రామాల్లోని పాఠశాలలను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సాయంత్రం తమ ఇళ్లను విడిచిపెట్టవద్దని, గుంపులుగా మాత్రమే బయటకు వెళ్లాలని స్థానికులకు అధికారులు హెచ్చరికలు జారీ జేశారు. ఈ మేరకు పోలీసులు సోషల్ మీడియా ద్వారా రాత్రిపూట ఇళ్ల నుండి బయటకు రావొద్దని ప్రజలను హెచ్చరిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటికి వెళ్లవల్సివస్తే తమతో ఆయుధాలు తీసుకెళ్లాలని గ్రామస్తులకు సూచించారు. అయితే అన్ని దాడుల్లో ఒకే జంతువు ప్రమేయం ఉందా లేదా వేర్వేరు జంతువులు దాడులు చేస్తున్నాయా అనేది అస్పష్టంగా ఇంకా తెలియరాలేదు. ఇప్పటి వరకూ జరిగిన దాడుల్లో చిరుత కదలికలు, దాడి చేసిన విధానం ఒకే విధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాగా అడవిలో నుంచి పూజారి మృతదేహాన్ని పోలీసులు వెలికితీస్తున్న వీడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# కన్నీరుపెట్టిన మంత్రి కొండా సురేఖ

(మొదటిపేజీ తరువాయి...)

ఆగ్రహం వ్యక్తం చేశారు కొండా సురేఖ. మహిళనని కూడా చూడకుండా బీఆర్ఎస్ నేతలు దారుణంగా సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ క్రమంలో ఆమె తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.కవిత జైలులో ఉన్నప్పుడు తాము ఇదే రకంగా ట్రోల్ చేశామా అని ప్రశ్నించారు. మహిళలంటే కేటీఆర్?కు మొదటి నుంచి చులకనే అని.. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు తనను ఇలాగే అగౌరపరిస్తే ఆ పార్టీ నుండి బయటకు వచ్చానని తెలిపారు. ఇకపై సోషల్ మీడియాలో పోస్టులు పెడితే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. సోషల్ మీడియాలో ట్రోలింగ్?పై సైబర్ క్రైమ్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అనుచిత పోస్టు పెట్టిన బీఆర్ఎస్‌కు తన శాపం తప్పకుండా తగులుతుందన్నారు.అంతకుముందు దీనిపై నిరసన తెలిపేందుకు కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ భవన్ దగ్గరకు వెళ్లడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తెలంగాణ భవన్ దగ్గర బీఆర్ఎస్ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు యత్నించాయి. అయితే వారిని బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట, వాగ్వాదం చోటు చేసుకుంది. ఇరు పార్టీల కార్యకర్తలు పరస్పరం దాడులు చేసుకున్నారు. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేశారు.



## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం

**టీ మీడియా, సెప్టెంబర్ 30, జిన్నారం:**
మండలం ఊట్ల గ్రామంలో ఇటీవల కరెంట్ షాక్ తో మృతి చెందిన నల్లా సాయి కుమార్ కుటుంబానికి విద్యుత్ శాఖ తరఫున మంజూరైన ఐదు లక్షల రూపాయల నష్టపరిహారం చెక్కుని అందజేసిన పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి . అనంతరం గుమ్మడిదల మండలం అన్నారం, జిన్నారం మండలం లక్ష్మీపతిగూడెం గ్రామాల్లో ఇద్దరు రైతులకు చెందిన రెండు బర్రెలు విద్యుత్ షాక్ తో మృతి చెందగా, 40 వేల రూపాయల చొప్పున 80 వేల రూపాయలు నష్ట పరిహారం అందించారు. హాజరైన జిల్లా పరిషత్ వైస్ మాజీ చైర్మన్ ప్రభాకర్, విద్యుత్ శాఖ అధికారులు.



## ఘనంగా స్వామి అమ్మవార్ల పల్లకి సేవ

**టీ మీడియా, సెప్టెంబర్ 30,మహానంది:**
మహానంది క్షేత్రంలో సోమవారం సాయంత్రం పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి, ఆలయ వేద పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో మేళతాళాలతో పల్లకి సేవ నిర్వహించారు. ఈ పల్లకి ఉత్సవ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.



## నందీశ్వరునికి ప్రదోషకాల పూజలు

**టీ మీడియా, సెప్టెంబర్ 30, మహానంది:**
మహానంది పుణ్య క్షేత్రంలో భాద్రపద బహుళ త్రయోదశి మహాప్రదోషం సందర్భంగా నందీశ్వరునికి సోమవారం మహా ప్రదోషకాల పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.భాద్రపద బహుళ త్రయోదశిని పురస్కరించుకొని వేద పండితులు రవిశంకర అవధాని, హనుమంతు శర్మ, ఆంజనేయ శర్మ, ప్రధాన అర్చకులు అర్జున శర్మ, ఉప ప్రధానార్చకులు జనార్ధన శర్మ లు నందీశ్వరునికి పంచామృతాభిషేకం, విశేష దవ్యాభిషేకాలు,హారతి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## దిమ్మెల మలుపు వద్ద రక్షణ గోడ నిర్మించండి

**టీ మీడియా, సెప్టెంబర్ 30, మహానంది:**
నంద్యాల గిద్దలూరు జాతీయ రహదారి నల్లమల అడవి ప్రాంతంలోని దిమ్మెల మలుపుల వద్ద రోడ్డు ప్రమాదంలో రహదారి అంచుల రక్షణ దిమ్మెను ఇటీవల లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రక్షణ గోడ పడిపోయింది. గాజుల పల్లె నుంచి గిద్దలూరు ప్రతినిత్యం వేల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు.రాత్రి వేళల్లో అవి కనపడక మృతి ఒడిలోకి వెళ్లే అవకాశాలు మేండుగా ఉన్నాయని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. రక్షణ దిమ్మె లేకపోవడంతో, పెను ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, రహదారులు, రోడ్డు భవనాల శాఖ వారు స్పందించి, పడిపోయిన ప్రహరీ గోడ దిమ్మెను వెంటనే మరమ్మతులు చేసి నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.



## రెండురోజుల్లో మద్యం షాపుల మార్గదర్శకాలు

- మంత్రి కొల్లు రవీంద్ర




**టీ మీడియా, సెప్టెంబర్ 30,అమరావతి :**
ఏపీలో మద్యం షాపుల ఏర్పాటుపై రెండురోజుల్లో మార్గదర్శకాలు జారీ చేయనున్నామని ఏపీ ఆబ్కారీశాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గత టీడీపీ హయాంలో మాదిరిగానే ప్రభుత్వ పర్యవేక్షణలో ప్రైవేట్ షాప్స్ నిర్వహణ జరిగేలా నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.ఏ జిల్లాలో ఎన్ని షాపులు అనే వివరాలు వెల్లడిస్తామని, 7 రోజుల పాటు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. సెలవుల మధ్యలో రెండురోజుల పాటు సెలవులు వస్తున్నాయని తెలిపారు. పదో రోజున డ్రా తీస్తామని వివరించారు. దసరా పండుగకు ముందే మద్యం షాపులు అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు.ఒక్కో దరఖాస్తుకు రూ. 2 లక్షల ఫీజుగా నిర్ణయించామని, ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులనైనా వేయవచ్చన్నారు. మద్యం ప్రియులకు అన్ని రకాల బ్రాండ్లు అందే విధంగా పారదర్శకంగా అందిస్తున్నామని తెలిపారు. రూ. 99 రూపాయలకే నాణ్యమైన మద్యాన్ని సామాన్యులకు అందిస్తామని వెల్లడించారు.




# ఫ్యామిలీ డిజిటల్ కార్డులు

- 119 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో పైలెట్ ప్రాజెక్టులు
- 238 ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన

**టీ మీడియా, సెప్టెంబర్ 30, హైదరాబాద్ :**
లంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి సంబంధించి 119 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టనున్న పరిశీలన సమర్థంగా చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రతి నియోజకవర్గం పరిధిలో ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని, పూర్తిగా పట్టణ/నగర ప్రాంతమైతే రెండు వార్డులు/ డివిజన్లు, పూర్తిగా గ్రామీణ నియోజకవర్గమైతే రెండు గ్రామాల్లో మొత్తంగా 238 ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. వార్డులు/ డివిజన్లలో జనాభా ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పరిశీలన బృందాల సంఖ్యను పెంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిట్ కార్డుల పైలెట్ ప్రాజెక్టు, సేకరించే వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 119 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్న గ్రామాలు, వార్డులు/ డివిజన్ల ఎంపిక పూర్తయిందని అధికారులు సీఎంకు వివరించారు. పైలెట్ ప్రాజెక్టును ఎన్ని రోజుల పాటు చేపడతారని సీఎం ప్రశ్నించారు. అక్టోబరు మూడో తేదీ నుంచి ఏడో తేదీ వరకు అయిదు రోజుల పాటు చేపడతామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అంతా సమ్మతిస్తే కుటుంబం ఫొటో తీయాలని, అదో అప్షనల్ గా ఉండాలని, కుటుంబం సమ్మతి లేకుంటే ఆ ఫొటో తీసుకోవాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయి పరిశీలనకు సంబంధించి ఉమ్మడి జిల్లాలకు ఉన్న నోడల్ అధికారులు కలెక్టర్లకు మార్గనిర్దేశం చేయాలని.. అప్పుడే పకడ్బందీగా కార్యక్రమం కొనసాగుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.ప్రభుత్వం వద్దనున్న రేషన్ కార్డు, పింఛను-స్వయం సహాయక సంఘాలు, రైతు భరోసా, రుణమాఫీ, బీమా, ఆరోగ్య శ్రీ, కంటి వెలుగు తదితర డేటాల ఆధారంగా ఇప్పటికే కుటుంబాల గుర్తింపునకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని, పైలెట్ ప్రాజెక్టులో దానిని నిర్ధారించుకోవడంతో పాటు కొత్త సభ్యులను జత చేయడం, మృతి చెందిన వారిని తొలగించడం చేస్తామని అధికారులు వివరించారు. కుటుంబ సభ్యుల వివరాల నమోదు, మార్పులుచేర్పుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఎటువంటి పొరపాట్లకు తావివ్వవద్దని హెచ్చరించారు. పైలెట్ ప్రాజెక్టుతో బయటకు వచ్చిన సానుకూలతలు, ఎదురైన ఇబ్బందులతో నివేదిక తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఆ నివేదికపై చర్చించి లోపాలను పరిహరించిన అనంతర పూర్తి స్థాయి క్షేత్ర స్థాయి పరిశీలన చేపడదామని ముఖ్యమంత్రి తెలిపారు.

# నేనడిగిన ప్రశ్నకే సమాధానం చెప్పండి

(మొదటిపేజీ తరువాయి...)

కడితే సీజ్ చెయ్యాలి.నిబంధనలు ఫాలో కావాలి.హైడ్రా అభినందనీయం కానీ రూల్స్ ఫాలో కావాలి.ఆదివారం కూల్చివేతలు సరికావు.ఆదివారం కూల్చివేతలపై కామన్ మ్యాన్‌కు ఏమని మేసేజ్ ఇస్తున్నారు. చార్మినార్ తహసీల్దార్ హైకోర్టును కూల్చలంటే హైడ్ర మేషనరీ పంపిస్తారా తహసీల్దార్ హైడ్రా కౌంటర్ దాఖలు చేయండి అంటూ ఆదేశించింది. హైడ్రా కమిషనర్ వాదనలకు న్యాయస్థానం ఏకభవించలేదు. కూల్చివేతలకు సంబంధించి వీడియోలు ఫైల్ చెయాలని నిబంధనలు ఫాలో అవుతూ కూల్చాలని హైడ్రా తహసీల్దార్‌కు సూచించింది. రాత్రికి రాత్రే కూల్చివేతలు సరికావని పేర్కొంది. ఉన్నదాన్ని కాపాడుకోవడానికే హైడ్రా దృష్టి పెట్టాలని హితవుపలికింది. చెరువులపై ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వాలని తెలిపింది.అందరినీ చంచల్ గూడ చర్లపల్లి పంపిస్తే అప్పుడు అర్థం అవుతుంది హైకోర్టు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది.

**హ్యాపీగా లేమన్న ధర్మాసనం**

హైడ్రా విషయంలో మేము హ్యాపీగా లేము. హైడ్రా ఏర్పాటు మీద రెండు పిటిషన్‌లు ఉన్నాయి. ఇష్టానుసారంగా చేస్తే జీవో 99 పై స్టే విధించాల్సి వస్తుంది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారా. హైడ్రా అంటే కేవలం కూల్చివేత చేయడమేనా.ప్రజల నమ్మకాన్ని కోల్పోవద్దు. పెద్ద పేద ప్రజల మధ్య వ్యత్యాసాలు చూస్తున్నారా లేదా నిజయితీగా చెప్పండి.ట్రాఫిక్ మీద మీరు ఏం చర్యలు తీసుకున్నారు. మూసి విషయంలో యాక్షన్ ప్లాన్ ఏంటి. మూసి మీద ఈరోజు 20 పిటిషన్‌లు ఉన్నాయి.అని హైకోర్టు పేర్కొంది. అలాగే హైడ్రా కమిషనర్ అమీన్ పూర్ ఎమ్ఆర్‌వోకు కౌంటర్ ధాఖలు చేయాలని హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. కాగా కోర్టు పరిధిలో ఉన్న భవనాలను హైడ్రా కూల్చడం పై గత విచారణలో హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.కోర్టుకు హాజరుకావాలని హైడ్రా కమిషనర్‌కు న్యాయస్థానం నోటీసులు జారీ చేయడంతో నేడు విచారణకు రంగనాథ్ హాజరయ్యారు.

**గత విచారణలో..**

అన్ని అనుమతులు పొంది ఆస్తులు విక్రయించి అప్పులు తెచ్చి హాస్పిటల్ కోసం ఐదంతస్తుల భవనాన్ని నిర్మించామని భూ ఆక్రమణ చట్టం -1905 కింద 48 గంటల నోటీసు ఇచ్చి 13 గంటల్లో భవనాన్ని కూల్చేశారని పేర్కొంటూ మహమ్మద్ రఫీ ఎన్.వెంకట్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం శుక్రవారం సెప్టెంబర్ 27 విచారణ చేపట్టింది.అక్రమ నిర్మాణాలంటూ ఆగమేఘాల మీద భవనాలను కూల్చివేస్తున్న హైడ్రా తీరును గత విచారణలో హైకోర్టు తప్పుపట్టింది.ఏ అధికారంతో కూల్చివేస్తున్నారో చెప్పాలని హైడ్రా కమిషనర్‌ను ఆదేశించింది.హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ భవనాన్ని ఎలా కూల్చారని నిలదీసింది.ఏఅధికారం ఏ చట్టప్రకారం ఇళ్ల కూలివేతలు చేపడుతున్నారో చెప్పాలంటూ హైడ్రాకు ఆదేశాలు జారీచేసింది. కోర్టు కేసులు పెండింగ్‌లో ఉండగా జోక్యం చేసుకోవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు ఉన్నప్పటికీ సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట్ పంచాయతీ శ్రీకృష్ణనగర్ ప్లాట్ నెంబర్ 92 సర్వే నంబరు 165, 166 లో ఉన్న ఓ ప్రైవేట్ హాస్పిటల్ భవనాన్ని ఈ నెల 22న కూల్చివేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ఆదివారం నాడు కూల్చివేతలు చేపట్టరాదని సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినప్పటికీ బాధితులకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ఉదయం 7.30 గంటలకు కూల్చివేతలు చేపట్టడం అక్రమమని పేర్కొంది.ఏ అధికారంతో ఇలా చేస్తున్నారో స్వయంగా వివరణ ఇవ్వాలని హైడ్రా కమిషనర్‌ను ఆదేశించింది. కమిషనర్ రంగనాథ్ అమీన్‌పూర్ తహసీల్దార్ ప్రత్యక్షంగా గానీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గానీ ఈ నెల 30న హాజరు కావాలని ఆదేశాలు జారీచేసింది.

# కర్ణాటక సీఎం పై.. మనీలాండరింగ్ కేసు

- నమోదు చేసిన ఈడీ



**టీ మీడియా, సెప్టెంబర్ 30,బెంగళూరు:**
కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం చర్యలు చేపట్టింది. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూ కుంభకోణం ఆరోపణలపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. సీఎం సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, బావమరిది మల్లికార్జున స్వామి, ఆయనకు భూమిని అమ్మిన దేవరాజుపై సెప్టెంబర్ 27న మైసూరు లోకాయుక్త నమోదు చేసిన కేసును ఈసీ పరిగణనలోకి తీసుకున్నది. ఈ నేపథ్యంలో వారిపై ఈడీ కేసు నమోదుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు సమాచార నివేదిక (ఈసీఐఆర్)ను దాఖలు చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ)లోని సెక్షన్లను ఈసీఐఆర్‌లో పేర్కొంది. ఈ నేపథ్యంలో నిందితులకు ఈడీ సమన్లు జారీ చేసి ప్రశ్నించడంతోపాటు వారి ఆస్తులను అటాచ్ చేసే అవకాశం ఉంది.కాగా, సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతికి ఆమె సోదరుడు బహుమతిగా ఇచ్చిన భూమిని ముడా సంస్థ స్వాధీనం చేసుకున్నది. ఆ భూమికి బదులుగా కోట్ల విలువైన 14 ప్లాట్లను ఆమెకు కేటాయించింది. ఇందులో భారీగా అవినీతి, అక్రమాలు జరిగినట్లు కర్ణాటకలోని ప్రతిపక్షమైన బీజేపీ ఆరోపించింది. దీంతో సీఎం సిద్ధరామయ్యపై విచారణ జరిపేందుకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ అనుమతి ఇచ్చారు.మరోవైపు గవర్నర్ నిర్ణయాన్ని కర్ణాటక హైకోర్టు సమర్థించింది. అనంతరం లోకాయుక్త పోలీసుల విచారణకు బెంగళూరులోని ప్రత్యేక కోర్టు కూడా గత వారం ఆదేశించింది. ఈ నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్య, ఆయన భార్య, బావమరిది, భూమిని అమ్మిన వ్యక్తిపై లోకాయుక్త పోలీసులు కేసు నమోదు చేశారు. దీని ఆధారంగా ఈడీ కూడా సోమవారం కేసు నమోదు చేసింది.

# నీ అయ్య జాగీరు కాదు..

- సీఎం రేవంత్‌పై కేటీఆర్ గరం గరం..

**టీ మీడియా, సెప్టెంబర్ 30,హైదరాబాద్ :**
సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేస్తారు. దశాబ్దాలుగా నివాసం ఉంటున్న వారి ఇండ్లను కూలగొడుతామంటే.. నీ అయ్య జాగీరు కాదంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 'ఇవాళ హైడ్రా కూల్చివేతల విషయంలో హైకోర్టులో కొంత రిలీఫ్ వచ్చిందన్నారు. 'హైడ్రా కమిషనర్ ప్రభుత్వ అధికారి అన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. మీరు మాట్లాడే మాటలు నేను కూడా విన్నాను. హైడ్రాను అడ్డుకుంటే భవిష్యత్‌లో హైదరాబాద్ మునిగేపోతదని మాట్లాడుతున్నరు. వీళ్లు లేనప్పుడు హైదరాబాద్ లేనే లేదు.. వీళ్లు వచ్చినంకనే హైదరాబాద్‌ను చక్కదిద్దుతున్నం అన్నట్లుగా బిల్డప్ ఇస్తున్నరు.మీరు విధ్వంసం చేయకపోతే చాలు. ఉన్న హైదరాబాద్‌ను ఉన్నట్లుగా ఉంచితే సరిపోతుంది. ఉన్న కంపెనీలు ఉంచండి. రియలెస్టేట్ రంగాన్ని దెబ్బతీయొద్దు. హైడ్రా దెబ్బకి ఇప్పటికే రిజిస్ట్రేషన్ ఆదాయం తగ్గింది. రూ.1150కోట్లు ఉన్నది రూ.750కోట్లకి పడిపోయింది. కొనుగోలుదారులు, పెట్టుబడిదారులు భయపడుతున్నారు. అక్రమ నిర్మాణాలను మొదట్లోనే అడ్డుకోండి. 50 సంవత్సరాల కింద కట్టినవాటిని కూలగొడుతమంటే నీ అయ్యజాగీరు కాదని తెలియజేస్తున్నాం. క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్తున్నాం. రేపు అంబర్‌పేట, తర్వాత ఎల్‌బీనగర్ సహా అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తాం. పాతబస్తీలోని అన్ని ప్రాంతాల్లోనూ పర్యటిస్తాం' అన్నారు.

**బ్రదర్‌ని కాపాడుకోవాలి.. పేదలకు కొట్టిపడేయాలి**

'అందరికంటే అరాచశక్తిని శ్రీధర్‌బాబు అడ్డుకోవాలి. అరాచకం అంటే అర్ధరాత్రి వెళ్లి పేదల ఇండ్లు కూలగొట్టడం. బ్రదర్‌ని కాపాడుకోవాలి.. పేదలను కొట్టిపడేయాలి. తిరుపతిరెడ్డి భద్రంగా ఉండాలి. అనుమల బ్రదర్స్ అందరూ నిక్షేపంగా ఉండాలే.. పేదలు మాత్రం రోడ్డుపై పడాలి. ఎల్‌బీనగర్ కొత్తపేటలో టేలాను బుల్డోజర్‌తో కొట్టేశారు. అది పైసాచికానందం. అరాచకం అంటే అదే. శ్రీధర్‌బాబు అంటే గౌరవం ఉండేది. నిన్నటి వ్యాఖ్యలతో ఆ గౌరవంపోయింది. కడుపు మండితే ప్రజలు తిడుతారు. మమ్మల్ని గతంలో తిట్టారు. మేం తిట్టినా పడ్డాం. మేం కట్టిన ప్రాజెక్టు ఏంటీ? కాళేశ్వరం. అందరికీ గౌరవంగా పురావాసం కల్పించాం. అందరినీ సంతృప్తి పరచడంతో ఇవాళ నీళ్లు హైదరాబాద్ వరకు వచ్చాయంటే అది కేసీఆర్ గొప్పతనం. ప్రతిపక్షం ఎంత ఇబ్బంది పెట్టినా పనులు పూర్తి చేశాం.

ఇప్పటి వరకు ఆ ప్రాంతంలో సర్వే చేయలేదు. ఏం చేసినా దొంగచాటుగా చేసింది. ఏదో పేరు చెప్పి డ్రోన్ల ఏరియల్ సర్వే చేసింది. అసలు ప్రజాభిప్రాయ సేకరణ చేయాలన్న రూల్ ఉన్నదని తెలుసా? వీళ్లకు.. చెంచల్‌గూడలో డబుల్ బెడ్రూంలు ప్రారంభించాం. అక్కడ కొన్ని మిగిలాయి. కొందరిని అక్కడికి పంపిస్తే అక్కడ లొల్లి అయ్యింది. ఏదైనా పద్ధతి ప్రకారం జరపాలి. అలా కాదంటే కుదరదు. మా పని మేం చేస్తాం. బీజేపోళ్లకు పట్టింపులేదు. రేవంత్ ఏం చేసినా బండి సంజయ్ జైజై అంటూ తిరుగుతున్నడు. అమృత్ స్కామ్ జరిగిందంటే కదలరూ మెదలరు. చాలా అంశాల్లో గమనిస్తున్నాం. బీజేపీ ఎంపీలు.. కాంగ్రెస్ ఎంపీలకంటే ఎక్కువ ఉత్సాహం ప్రదర్శిస్తూ రేవంత్‌రెడ్డికి తప్పెటతాళాలు వేసుకుంటూ.. బ్రహ్మాండంగా చెక్క భజన చేసుకుంటూ తిరుగుతున్నరు. వాళ్ల నుంచి ఏం ఆశిస్తాం. భారతదేశంలో అతిపెద్ద కుంభకోణం. కాంగ్రెస్ పార్టీ వచ్చే జాతీయ ఎన్నికలకు రిజర్వ్ బ్యాంక్‌గా ఈ ప్రాజెక్టును వాడుకోవాలనుకుంటున్నది' అంటూ విమర్శించారు.

## హైడ్రా పేదల నివాసాల జోలికి వెళ్లదు..

- స్పష్టం చేసిన ఏవీ రంగనాథ్



**టీ మీడియా, సెప్టెంబర్ 30, హైదరాబాద్ :**
హైడ్రా అంటే కూల్చివేతలే కాదని కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. హైడ్రా పరిధి ఔటర్ రింగు రోడ్డు వరకే అని ఆయన తెలిపారు. నగరంలోనే కాదు.. రాష్ట్రంలో.. ఆఖరకు ఇతర రాష్ట్రాల్లో కూల్చివేతలను కూడా హైడ్రాకు ఆపాదించి సామాజిక మాధ్యమాలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని అన్నారు.హైడ్రా పేదల నివాసాల జోలికి వెళ్లదని ఏవీ రంగనాథ్ తెలిపారు. అలాగే నివాసం ఉంటే ఆ ఇళ్లను కూల్చదని చెప్పారు. కూల్చివేతలన్నీ హైడ్రావి కాదని స్పష్టం చేశారు. ప్రజలు, సామాజిక మాధ్యమాలు ఈ విషయాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వనరుల పరిరక్షణ, చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటం, వర్షాలు, వరదల సమయంలో రహదారులు, నివాస ప్రాంతాలు మునిగిపోకుండా చర్యలు తీసుకోవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు.మూసీ నదికి ఇరువైపులా సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదని కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. అక్కి నివాసితులను హైడ్రా తరలించడం లేదని చెప్పారు. అక్కడ ఎలాంటి కూల్చివేతలను హైడ్రా చేపట్టడం లేదని పేర్కొన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలోని ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని స్పష్టం చేశారు. మూసీ సుందరీకరణ ప్రత్యేక ప్రాజెక్టు అని.. దాన్ని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతోందని తెలిపారు.




## బుల్డోజర్‌తో ఇళ్ల కూల్చివేతలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- అస్సాం ప్రభుత్వానికి ధిక్కార నోటీసు

**టీ మీడియా, సెప్టెంబర్ 30,గువాహతి:**
బుల్డోజర్‌తో ఇళ్లను కూల్చివేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అస్సాం ప్రభుత్వానికి కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసింది. బుల్డోజర్ చర్యలపై సుప్రీంకోర్టు సెప్టెంబర్ 17న ఉత్తర్వులు జారీ చేసింది. ముందస్తు న్యాయపరమైన అనుమతి లేకుండా కూల్చివేతలను దేశవ్యాప్తంగా నిషేధించింది. అయితే రోడ్లు, ఫుట్‌పాత్‌లు, రైల్వే లైన్లు, నీటి వనరుల ఆక్రమణలకు సంబంధించిన కేసులకు మినహాయింపు ఇచ్చింది.కాగా, అస్సాం కమ్రూప్ జిల్లా కచుటోలి పత్తర్ గ్రామం పరిధిలో గిరిజన భూమిని ఆక్రమించి నిర్మించిన 47 ఇళ్లను అధికారులు ఇటీవల కూల్చివేశారు. ఈ నేపథ్యంలో కోర్టు అనుమతి లేకుండా ఎలాంటి కూల్చివేతలు చేపట్టరాదన్న సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారని 47 మంది నివాసితులు ఆరోపిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమ పిటిషన్లు పరిష్కరించే వరకు ఎలాంటి చర్యలు తీసుకోబోమని అస్సాం అడ్వకేట్ జనరల్ సెప్టెంబరు 20న గౌహతి హైకోర్టుకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అలాగే భూ యజమానులతో ఒప్పందాలు చేసుకుని దశాబ్దాలుగా తాము అక్కడ నివసిస్తున్నామని, చట్టపరమైన నిబంధనలను తాము ఉల్లంఘించలేదని పిటిషనర్లు వాదించారు.సుప్రీంకోర్టు న్యాయమూర్తులు బీఆర్ గవాయి, కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపింది. అస్సాం ప్రభుత్వానికి కోర్టు ధిక్కార నోటీసు జారీ చేసింది. మూడు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ఆ రాష్ట్రాన్ని ఆదేశించింది. తదుపరి విచారణ వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని పేర్కొంది.